ఘనంగా వినాయక చవితి వేడుకలు



రామ మందిరం వద్ద వినాయకుని పూజల్లో పాల్గొన్న భక్తులు



షరాఫ్ బజార్ మండపంలో వినాయకుని పూజలో పాల్గొన్న భక్తులు

వాడవాడలా కన్నుల పండువగా వినాయకచవితి వేడుకలు

ప్రత్తిపాడు: వినాయకచవితి పండుగ సంబరాలు అంబరాన్నంటాయి. ఊరూరా, వీధి వీధినా పార్వతీ తనయుడి నవరాత్రి ఉత్సవాలు కన్నుల పండువగా ప్రారంభమయ్యాయి. జైబోలో గణేష్ మహరాజ్‌కీ జై అంటూ ఆబాలగోపాలం భక్తిశ్రద్ధలతో అంగరంగ వైభవంగా పండుగను జరుపుకున్నారు. మండల కేంద్రమైన ప్రత్తిపాడుతో పాటు పలు గ్రామాలలోని ప్రధాన వీధులలో రకరకాల రూపాలలో కొలువుదీరిన విఘ్నేశ్వరుడు సర్వాంగ సుందరంగా ప్రజలకు దర్శనమిచ్చాడు. మండలంలో సుమారు 35 విగ్రహాలకు పైగా ఏర్పాటు చేశారు. నవరాత్రుల కోసం ప్రత్యేకంగా నిర్మించిన మండపాలలో లంబోదరునికి విశేష పూజలు నిర్వహించారు. వినాయకునికి పండ్లు అంటే ఇష్టం కావడంతో గణపతి పూజలో పాలవెల్లినిండా పండ్లే దర్శనమిచ్చాయి. ఉండ్రాళ్ళు, చలిమిడి, వడపప్పు, పానకం, గారెలు కూడా ఆయనకు భక్తులు సమర్పించారు. స్థానిక వినాయకుని దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అన్ని గ్రామాలలో వీధివీధినా ఏర్పాటు చేసిన విగ్రహాల వద్ద భక్తులు విశేష పూజలు నిర్వహించి కోరిన కోరికలు తీర్చమంటూ విఘ్నేశ్వరుడిని వేడుకున్నారు. మట్టితో తయారు చేసిన వినాయక విగ్రహాలకు ప్రాధాన్యత ఏర్పడింది. అధిక శాతం వీధుల్లో చిన్నారుల కోలాహలం కొట్టొచ్చినట్లు కనిపించింది. చిన్నారులు సైతం చందాలు వేసుకుని వినాయకుడి విగ్రహాలను, మండపాలను ఏర్పాటు చేసి పూజలు చేయడం విశేషం.

వాడవాడలా కొలువుదీరిన గణనాథుడు

పొన్నూరు: పొన్నూరు మండలంలో వినాయక చవితి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. పట్టణంతోపాటు అన్ని గ్రామాల్లో వీధి వీధిన ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో గణనాథుని విగ్రహాలకు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. పట్టణంలోని నిడుబ్రోలు సెంటర్, రామ మందిరం ప్రాంగణం, షరాఫ్ బజార్, రైలు పేట, భావనగర్, గ్రామాల్లోని ప్రధాన సెంటర్లలో ఏర్పాటు చేసిన మండపాల్లో వివిధ రూపాల్లో కొలువుదీరిన గణపయ్యలు భక్తుల నుంచి పూజలందుకున్నారు. కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. మండపం వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

విఘ్నాలు తొలగాలని..

పెదనందిపాడు: అన్ని విఘ్నాలు తొలగించి మమ్మల్ని చల్లగా చూడాలి వినాయక అని ప్రజలు విఘ్నేశ్వరుడిని కోరుకుంటూ ప్రతి గ్రామంలో వినాయక చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సోమవారం పెదనందిపాడు మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో వినాయక చవితి వేడుకలు నిర్వహించారు. అర్చకులు శాస్త్రోక్తంగా పూజలు చేసారు. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

చేబ్రోలులో

చేబ్రోలు: చేబ్రోలు మండలంలో వినాయకచవితి వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో వినాయకచవితి సందర్భంగా చలువ పందిళ్లు వేసి భారీ వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కేంద్రమైన చేబ్రోలులోని కూడలి ప్రాంతాల్లో భక్త బృందాలు ఆకర్షణీయమైన వినాయక విగ్రహాలను ఏర్పాటు చేశారు. మెయిన్ రోడ్డు ప్రాంతంలో ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం ఆకట్టుకుంది. శలపాడు గ్రామంలోని రామాలయం సెంటర్‌లో వినాయక విగ్రహం ఏర్పాటు చేశారు. మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో సుమారు వంద వరకు చిన్న, పెద్ద వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.




ప్రత్తిపాడులోని పెద్ద రామాలయం వద్ద ఏర్పాటు చేసిన లంబోదరుని విగ్రహం ఎదుట పూజలు



నిడుబ్రోలు సెంటర్లో వినాయకుని పూజలో పాల్గొన్న భక్తులు



భావానగర్ కాలనీలో మండపం వద్ద భక్తులకు అన్నదానం



చేబ్రోలులోని ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం



శలపాడు గ్రామం రామాలయం సెంటర్‌లో పూజలు అందుకున్న గణనాథుడు

ఉపాధి హామీ పథకం పనులపై సామాజిక తనిఖీ



సిబ్బంది పనితీరుపై తనిఖీ నిర్వహిస్తున్న అధికారులు

పొన్నూరు: మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో రాష్ట్ర రూరల్ డెవలప్‌మెంట్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో మండలంలోని అన్ని గ్రామాల్లో జరిగిన పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక సభ నిర్వహించారు. కార్యక్రమంలో స్టేట్ రిసోర్స్ పర్సన్ సి.హెచ్. రాజు, పి. రామారావు, ప్రిసైడింగ్ అధికారి శివ నారాయణ పాల్గొని గ్రామాల్లో ఉపాధి హామీ పథకం పనులు సక్రమంగా జరిగాయా, జరిగిన పనులకు కార్మికులకు వేతనాలు అందాయా, ఆ పనులు గ్రామానికి ఉపయోగకరంగా ఉన్నాయా, అనే అంశాలపై విచారణ చేపట్టారు. గ్రామాల్లో జరిగిన పనులపై ఈనెల నాలుగో తేదీ నుంచి ప్రత్యేక బృందాలు తనిఖీలు నిర్వహించాయి. ఈ నేపథ్యంలో గ్రామాల్లో జరిగిన పనులు, ఉపాధి హామీపై వచ్చిన అభియోగాలపై విచారణ చేపట్టారు. ప్రజా వేదికలో సేకరించిన పూర్తి నివేదికను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి సిబ్బందిపై తగ్గిన చర్యలు తీసుకోనున్నట్లు రిసోర్స్ పర్సన్‌లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ బి. పద్మలీల, ఎంపీడీవో శ్రీనివాసరావు, విజిలెన్స్ అధికారి విజయలక్ష్మి, ఏపీడీ పి.బాలమ్మ, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

అనుమతుల్లేని ఆర్కెస్ట్రా వాహనం సీజ్



పెదగొట్టిపాడులో పోలీసులు సీజ్ చేసిన ఆర్కెస్ట్రా వాహనం

ప్రత్తిపాడు: అనుమతులు లేకుండా వినాయక ఉత్సవాల్లో తిప్పుతున్న ఆర్కెస్ట్రా వాహనాన్ని పోలీసులు సీజ్ చేశారు. గణేష్ నవరాత్రి వేడుకల్లో భాగంగా ప్రత్తిపాడు మండలం పెదగొట్టిపాడు గ్రామంలో కొందరు ఎలాంటి ముందస్తు అనుమతులు లేకుండా వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేయడంతో పాటు, నిర్వాహకులు ఆర్కెస్ట్రా వాహనాన్ని కూడా గ్రామంలోకి తీసుకువచ్చారు. దీంతో ఎస్ఐ డి.రవీంద్ర బాబు అనుమతుల్లేని ఆర్కెస్ట్రా వాహనాన్ని సీజ్ చేసి, పోలీసు స్టేషనుకు తరలించారు. ఎస్ఐ మాట్లాడుతూ అనుమతులు లేకుండా విగ్రహ కమిటీలు ఆర్కెస్ట్రాలు, డీజేలు ఏర్పాటు చేస్తే కేసులు నమోదు చేసి, వాహనాలను నిర్మొహమాటంగా సీజ్ చేస్తామని హెచ్చరించారు. అందుచేత నిర్వాహకులు నిబంధనలు అనుసరించి వేడుకలు జరుపుకోవాలని కోరారు. అదేవిధంగా నిమజ్జన ఊరేగింపుల్లో, విగ్రహాల వద్ద పార్టీ జెండాలు గానీ పార్టీల పాటలు గానీ ప్రదర్శించడానికి వీల్లేదన్నారు.

పెరటి తోటల పెంపకంతో ప్రయోజనాలెన్నో

ప్రత్తిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు అడిషనల్ సీడీపీవో సీహెచ్. విజయనిర్మల



ప్రత్తిపాడులో అంబేడ్కర్, గాంధీజీ చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న తల్లులు, గర్భిణులు

కోయవారిపాలెం (ప్రత్తిపాడు): పెరటి తోటల పెంపకంతో ఎన్నో ప్రయోజనాలున్నాయని ప్రత్తిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు అడిషనల్ సీడీపీవో సీహెచ్. విజయనిర్మల అన్నారు. పోషణ మాసోత్సవాలలో భాగంగా కోయవారిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం సెక్టార్ సూపర్‌వైజర్ వి.అరుణ ఆధ్వర్యంలో గర్భిణులు, బాలింతలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత మహాత్మాగాంధీ, రాజ్యాంగ ప్రధాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు దేశానికి అందించిన సేవలను వివరించారు. వారిని నిత్యం స్మరించుకుంటూ, వారి కృషిని నేటితరంతో పాటు భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. గ్రామాల్లో విస్తృతంగా మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పి.రజిని, కె.జిక్కి తదితరులున్నారు.

ఇంటి ఆవరణలో మొక్కల పెంపకం..

ప్రతి ఒక్కరూ తమ ఇంటి ఆవరణలో మొక్కలను నాటాలని ప్రత్తిపాడు సెక్టార్ సూపర్‌వైజర్ ఎం.వెంకటరత్నం అన్నారు. పోషణ మాసోత్సవాలలో భాగంగా సోమవారం ప్రత్తిపాడు యాదవపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. తల్లులు, గర్భిణులతో మొక్కలు నాటించారు. చిరుధాన్యాల వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. టీహెచ్‌ఆర్, ఎఫ్‌ఆర్‌ఎస్‌లపై తల్లులకు అవగాహన కల్పించారు. కార్యకర్తలు జి.నాసరమ్మ తదితరులు పాల్గొన్నారు.

37 మందిపై బైండోవర్ కేసులు



చేబ్రోలు తహసీల్దారు కార్యాలయంలో ముందుగా బైండోవర్ చేస్తున్న పోలీసులు

చేబ్రోలు: వినాయకచవితి పండుగ వేడుకల సందర్భంగా ఎటువంటి వివాదాలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యగా 37 మందిపై బైండోవర్ కేసు నమోదు చేసినట్లు చేబ్రోలు ఎస్ఐ కే ఆనంద్ మంగళవారం తెలిపారు. చేబ్రోలు మండలం గుండవరం గ్రామంలో ఇరువర్గాలకు చెందిన 17మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశారు. అలాగే నారాకోడూరు గ్రామానికి చెందిన 20మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసి తహసీల్దారు కేవీ గోపాలకృష్ణ ముందు హాజరు పరిచారు. వినాయకచవితి వేడుకలు, నిమజ్జన సమయాల్లో ఎటువంటి వివాదాలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యగా రెండు గ్రామాలకు చెందిన వారిపై బైండోవర్ కేసులు నమోదు చేశారు. ఎస్ఐ కె.ఆనంద్ కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రకృతి వైద్యంపై సదస్సు

వీవీఐటీ ఎన్ఎస్ఎస్ విద్యార్థుల ఆధ్వర్యంలో నిర్వహణ

పెదకాకాని: వీవీఐటీ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ విద్యార్థుల ఆధ్వర్యంలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నేచురోపతి, త్రిగుణ నేచర్ క్యూర్ అండ్ హెల్త్ ట్రస్ట్, పూణే వైద్యులచే మెడికల్ క్యాంప్, రోగ్‌ముక్త్ భారత్ నందు ప్రకృతి వైద్యం పాత్ర అంశంపై సదస్సు నిర్వహించారు. మండలంలోని నంబూరు వీవీఐటీలో మంగళవారం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నేచురోపతి వైద్యులు డాక్టర్ ఉమాసుందరి హాజరయ్యారు. ఈ సదస్సులో ఉమాసుందరి మాట్లాడుతూ శరీరం సహజ సిద్ధంగా రోగాలను పరిష్కరించుకోగల శక్తిని కలిగి ఉంటుందని, పంచభూతాలతో వైద్యం చేయడమే నేచురోపతి అన్నారు. మంచి ఆహారం, వ్యాయామం, యోగా, పరిశుభ్రత నిద్రతో ఆరోగ్యకరమైన జీవనశైలిని కొనసాగించవచ్చని విద్యార్థులకు సూచించారు. జీవన విధానం సరిగా లేకపోవడమే రోగాలకు కారణం అని అలాంటి వాటి మూలాలు గమనించి సరిచేసుకోవడం వలన రోగాలకు దూరంగా ఉండవచ్చని వివరించారు. ప్రకృతి వైద్యం, ప్రకృతి ఆరోగ్య సంబంధిత వస్తువులకు దేశవ్యాప్తంగా మంచి ఆదరణ లభిస్తుందని తెలిపారు. అనంతరం విద్యార్థుల ఆరోగ్య సమస్యలకు ప్రకృతి వైద్యంలో గల పరిష్కారాలను తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వెంకటేశ్వరరాజు, ప్రిన్సిపల్ డాక్టర్ వై.మల్లికార్జున రెడ్డి, డీన్ అకడమిక్ డాక్టర్ కె.గిరిబాబు, డీన్ అడ్మిన్ డాక్టర్ ఎస్ కుమారస్వామి , అధ్యాపకులు పాల్గొన్నారు.

క్రీడల అభివృద్ధికి ప్రభుత్వ సహకారం

- వెనిగండ్లలో ప్రారంభమైన ఎస్‌జీఎఫ్ క్రీడాపోటీలు
- నియోజవర్గస్థాయిలో అండర్ 14, అండర్ 17 బాలబాలికలకు పోటీల నిర్వహణ
- విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలి
- క్రీడాల ద్వారా మానసికోల్లాసం, శారీరక దృఢత్వం



ఎస్‌జీఎఫ్ క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు గోళ్ళ జ్యోతి



కబడ్డీ పోటీల్లో తలపడుతున్న విద్యార్థులు

పెదకాకాని: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని జెడ్పీటీసీ సభ్యురాలు గోళ్ళ జ్యోతి అన్నారు. పెదకాకాని మండలంలోని వెనిగండ్ల జిల్లా పరిషత్ పాఠశాలలో రెండు రోజుల పాటు జరిగే ఆటల పోటీలను మంగళవారం జెడ్పీటీసీ సభ్యురాలు గోళ్ళ జ్యోతి, జిల్లా ఉప విద్యాశాఖాధికారి ఎస్.వెంకటేశ్వరరావు, గ్రామ సర్పంచి వేల్పుల శ్రావణి ప్రారంభించారు. కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నంబూరు తిరుపతిరావు అధ్యక్షత వహించారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీలను ప్రారంభించిన అనంతరం గోళ్ళ జ్యోతి మాట్లాడుతూ విద్యార్థులు కేవలం చదువులకే పరిమితం కాకుండా క్రీడల్లోనూ రాణించి క్రీడా అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగించడంతో పాటు శారీరక దృఢత్వానికి దోహదపడతాయన్నారు. చిన్నతనంలోనే ఇష్టమైన క్రీడను ఎంపిక చేసుకుని ఉత్తమ క్రీడాకారులుగా ఎదగాలన్నారు. జిల్లా ఉప విద్యాశాఖాధికారి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో క్రీడాభివృద్ధికి ప్రోత్సహిస్తుందన్నారు. క్రీడల అభివృద్ధికి సహాయ సహకారాలు అందించడం అభినందనీయమన్నారు. గ్రామ సర్పంచి వేల్పుల శ్రావణి మాట్లాడుతూ విద్యార్థులను ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉందన్నారు. క్రీడాకారులను పరిచయం చేసుకుని కబడ్డీ ఆటను ప్రారంభించారు. పీఈటీ మస్తాన్‌రెడ్డి పాఠశాలలో రాష్ట్రస్థాయి క్రీడలు నిర్వహించడానికి కూడా సిద్ధంగానే ఉన్నామని, దాతలు ముందుకు వచ్చి క్రీడా వేదిక నిర్మించాలని(డయాస్) కోరారు. ఈ క్రీడల్లో పెదకాకాని, చేబ్రోలు, పొన్నూరు మండలాల నుండి అండర్ 14, అండర్ 17 బాల బాలికలు సుమారు 130 మంది, 30 మంది వ్యాయామోపాధ్యాయులు పాల్గొన్నారు. వ్యాయామోపాధ్యాయులు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, త్రో బాల్, బాల్ బాడ్మింటన్, షటిల్, టెన్నికాయిట్, యోగా, అథ్లెటిక్స్ నిర్వహించారు. రెండవరోజు బుధవారం బాలికలకు ఆటల పోటీలు బాలురకు అథ్లెటిక్స్‌తో పాటు నియోజకవర్గ స్థాయి జట్లను ఎంపిక చేయడం జరుగుతుందని పీఈటీ ఇన్నయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ వైస్ ఎంపీపీ కామినేని శ్రీనివాసరావు, బండి సాహితి చారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు బండి అశోక్‌రెడ్డి, గోళ్ళ జోసఫ్, పేరెంట్స్ కమిటీ చైర్మన్ కొండముదుగుల నాగజ్యోతి, టీచర్స్ పాల్గొన్నారు.

విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్న విద్యార్థిని



ప్రధానోపాధ్యాయురాలిని విచారిస్తున్న పోలీసులు

పొన్నూరు: ఇరువురు విద్యార్థినుల మధ్య ఏర్పడిన స్వల్పవివాదం కారణంగా విద్యార్థిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పొన్నూరులోని నిడుబ్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ఇరువురు విద్యార్థినుల మధ్య డబ్బుల విషయంలో స్వల్ప వివాదం నెలకొంది. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జమ్ముల శివలక్ష్మి ఇరువురిని పిలిచి మందలించారు. అయితే తనని మాత్రమే మందలించారని మనస్థాపానికి గురైన మాచవరం గ్రామానికి చెందిన విద్యార్థిని అదే రోజు సాయంత్రం పాఠశాలలోనే ఎలుకల మందు పేస్టును చాక్లెట్‌తో కలిపి తిన్నట్లు తెలిసింది. ఈ విషయాన్ని స్కూల్లో ఎవరు గమనించకపోవడంతో విద్యార్థిని ఫోన్ ద్వారా తల్లిదండ్రులకు సమాచారం అందించింది. స్థానికంగా ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతూ మెరుగైన వైద్య చికిత్స కోసం అదే రోజు అర్ధరాత్రి మంగళగిరి ఎన్నారై వైద్యశాలకు బాలికను తరలించారు. ప్రస్తుతం బాలిక ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉంది. అయితే బాలిక ఆరోగ్య పరిస్థితి క్షీణించడంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఈ క్రమంలో మంగళవారం పాఠశాల ఉపాధ్యాయుల నిర్లక్ష్యం కారణంగానే తమ కుమార్తె ఆరోగ్య పరిస్థితి విషమించిందని తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఆగ్రహానికి గురై పాఠశాల ఆవరణలో ఆందోళన చేశారు. విద్యార్థుల మధ్య వివాదం చోటుచేసుకున్నా, పాఠశాలలోనే ఎలుకల మందు తిని విద్యార్థిని ఆరోగ్య పరిస్థితి క్షీణించినా వైద్య సహాయం అందించకుండా నిర్లక్ష్యం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న పట్టణ పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వివరాలను సేకరించారు.

ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావనతో జీవనం సాగించాలి





నంబూరులో విఘ్నేశ్వరుని వద్ద ప్రముఖ క్రికెటర్ అంబటి తిరుపతిరాయుడు, స్థానిక నాయకులు

- సకల విఘ్నాలు తొలగించే విఘ్నేశ్వరుని ఆశీస్సులు అందరికీ ఉండాలి
- అంబటి రాయుడు

పెదకాకాని: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావాలతో జీవనం సాగించాలని ప్రముఖ క్రికెటర్ అంబటి తిరుపతిరాయుడు అన్నారు. వినాయక చవితి పురస్కరించుకుని మండలంలోని నంబూరు గ్రామానికి విచ్చేశారు. గ్రామంలో ఏర్పాటు చేసిన చవితి పందిళ్ళ వద్దకు చేరుకుని పూజల్లో పాల్గొన్నారు. విఘ్నేశ్వరునికి పూజా ద్రవ్యములు సమర్పించారు. ఈ సందర్భంగా అంబటి రాయుడు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భక్తిభావాలతో తమ ఇష్ట దైవాల అనుగ్రహం పొందాలన్నారు. దైవాశీస్సులతో ప్రజలందరూ సుఖశాంతులతో జీవించాలన్నారు. గ్రామంలో ఏర్పాటు చేసిన పలు వినాయక చవితి పందిళ్ళకు చేరుకుని విఘ్నేశ్వరునికి కొబ్బరికాయలు కొట్టి పూజల్లో పాల్గొన్నారు. ట్రాక్టర్లు నడిపి యువతను ఉత్సాహపరచారు. పందిళ్ళలో కమిటీ సభ్యులు అంబటి రాయుడుకు ఘన స్వాగతం పలికారు. శాలువాతో సత్కరించి బొకేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ జొన్నల అవినాష్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు చాగంటి మురళీమోహన్‌రెడ్డి, జిల్లా వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ సయ్యద్ సుబాని, షేక్ జాని(దండిబాబు) తదితరులు పాల్గొన్నారు.

తుదిదశకు ఓటర్ల జాబితా సవరణ

నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఎం.ప్రభాకర్ రెడ్డి

ప్రత్తిపాడు: ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ తుదిదశకు చేరుకుందని నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, గుంటూరు ఆర్డీవో ఎం.ప్రభాకర్ రెడ్డి అన్నారు. నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం ఐదు మండలాల రాజకీయ పార్టీల నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. గత కొద్ది రోజులుగా జరుగుతున్న స్పెషల్ రివిజన్‌లో భాగంగా నియోజకవర్గ వ్యాప్తంగా మార్పులు, చేర్పులకు సంబంధించి సుమారు 21 వేల దరఖాస్తులు వచ్చాయన్నారు. వాటిన్నింటినీ నిశితంగా పరిశీలించి, ఒకటికి రెండు సార్లు విచారించి, అర్జీలపై నిర్ణయం తీసుకుంటున్నామని చెప్పారు. ఆయా పార్టీల నేతలకు వారి మండలాలకు సంబంధించిన అభ్యంతరాలుంటే వెంటనే తహసీల్దార్లకు తెలియజేయాలని కోరారు. ఇందుకు సంబంధించిన అర్జీల కాపీలను ఆయా పార్టీల నాయకులకు అందజేశారు. ఓట్ల తొలగింపు, చేర్పులు పూర్తి పారదర్శకంగా, ఎలాంటి అనుమానాలకు తావు లేకుండా చేస్తున్నామని స్పష్టం చేశారు. ఓటు హక్కు నమోదుకు సమయం పూర్తవ్వడం అనేది ఉండదని, ఓటు నమోదు అనేది నిరంతర ప్రక్రియ అని సూచించారు. అదే విధంగా పోలింగ్ స్టేషన్ల మార్పుపై కూడా అభ్యంతరాలుంటే తెలియజేయాలన్నారు. సమావేశంలో తహసీల్దార్లు, రాజకీయ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జగనన్న గోరుముద్ద నాణ్యతలో రాజీపడవద్దు

ఉర్దూ పాఠశాలల ఉప తనిఖీ అధికారి ఖాసిం



పెదగొట్టిపాడు (ప్రత్తిపాడు): జగనన్న గోరుముద్ద పథకం అమలు, నాణ్యత విషయంలో రాజీ పడవద్దని ఉర్దూ పాఠశాలల ఉప తనిఖీ అధికారి ఎండీ ఖాసిం అన్నారు. ప్రత్తిపాడు మండలం గొట్టిపాడులోని మండల పరిషత్ ఉర్దూ ప్రాథమిక పాఠశాలను ఎండీ ఖాసిం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు, విద్యార్థుల విద్యా నైపుణ్యాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలసి మధ్యాహ్న భోజనం చేసి, నాణ్యతను పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించిన రికార్డులు పక్కాగా నిర్వహించాలని ప్రధానోపాధ్యాయునికి సూచించారు.

వరిలో ఆకుముడత తెగులు నివారణపై అవగాహన

గుంటూరు రూరల్: వరిపంటలో ఆకుముడత తెగులు నివారణకు చర్యలు తీసుకోవాలని లాంఫాం ఏరువాక కేంద్రం సస్యరక్షణ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.నగేష్ తెలిపారు. మంగళవారం మండలంలోని జొన్నలగడ్డ గ్రామంలో వరిపంటల్లో క్షేత్రస్థాయి సందర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరిలో ఆకుముడత నివారణకు ట్రైకోగామా గుడ్లు తినే బదనికలను పంటల్లో విడుదల చేయటం ద్వారా నివారించవచ్చన్నారు. ఎకరానికి 20 వేల చొప్పున బదనికలను విడుదల చేయాలన్నారు. గ్రామంలోని వంగా నవీన్‌రెడ్డి అనే రైతు పొలంలో బదనికలను విడుదల చేసి ప్రత్యక్షంగా రైతులకు వివరించారు. దీనివల్ల రైతులకు సాగు ఖర్చులు తగ్గుతాయని వాతావరణంలో కాలుష్యం తగ్గుతుందని తెలిపారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ డాక్టర్ కిషోర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల సమస్యల పరిష్కారానికి చర్యలు

– ఈఆర్ఓ హరిహర నాథ్



పొన్నూరు: పొన్నూరు నియోజకవర్గంలో చేపడుతున్న ఇంటింటి ఓటరు సర్వేలో వస్తున్న ఫిర్యాదులను, పోలింగ్ కేంద్రాల సమస్యలను వెంటనే పరిష్కారం దిశగా చర్యలు చేపడుతున్నట్లు ఓటరు నమోదు అధికారి హరిహరనాథ్ అన్నారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గంలో జరుగుతున్న ఓటర్ సర్వే పనితీరుపై అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయ పార్టీల నుంచి వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించే దిశగా చర్యలు చేపడుతున్నామన్నారు. ఏమైనా ఫిర్యాదులు, పోలింగ్ స్టేషన్ల సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో పెదకాకాని, చేబ్రోలు, పొన్నూరు తహసీల్దార్లు పి.రత్నం, గోపాలకృష్ణ, శ్రీకాంత్ కేదారినాథ్, మున్సిపల్ కమిషనర్ ఎస్ఎంఈ నయీమ్ అహ్మద్, డీటీ ఫణి కుమార్, సీనియర్ అసిస్టెంట్ ఆనందరావు, ఆర్ఐ రామకృష్ణ, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే కేసులు నమోదు

– ఎస్ఐ డి. రవీంద్రబాబు

ప్రత్తిపాడు: బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ డి.రవీంద్రబాబు హెచ్చరించారు. మండల పరిధిలోని పదహారవ నంబరు జాతీయ రహదారి సమీపంలోని బోయపాలెం మద్యం దుకాణాల చుట్టుపక్కల కొందరు మందుబాబులు నిత్యం బహిరంగంగా మద్యం సేవిస్తున్నారు. ఇటీవల ఇదే విషయమై ఫిర్యాదులు వస్తుండటంతో ఎస్ఐ సిబ్బందితో కలిసి ఆకస్మిక తనిఖీలు చేశారు. ఆ సమయంలో కొందరు మందుబాబులు అక్కడ బహిరంగంగానే మందు తాగుతూ కనిపించారు. దీంతో ఎస్ఐ మందుబాబులకు వార్నింగ్ ఇచ్చారు. పబ్లిక్‌కు ఇబ్బంది కలిగించేలా మందు తాగితే ఉపేక్షించేది లేదన్నారు. ఇకపై ఇలా చేస్తే కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరుస్తామని చెప్పారు.

విలువ జోడింపుతో రైతులకు అధిక ఆదాయం

రైతు నేస్తం ఫౌండేషన్ చైర్మన్ వేంకటేశ్వరరావు

గుంటూరు రూరల్: సేంద్రియ సాగులో పంటలకు విలువ జోడింపుతో రైతులు అదనపు ఆదాయం పొందవచ్చని రైతు నేస్తం ఫౌండేషన్ చైర్మన్ వై.వెంకటేశ్వరరావు తెలిపారు. సోమవారం వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంట గ్రామంలోగల రైతు నేస్తం ఫౌండేషన్‌లో సేంద్రియ సాగు విలువల జోడింపుపై రైతు శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేంద్రియ సాగు, పంట దిగుబడులకు విలువ జోడింపులే సరైన మార్గమని తెలిపారు. అనంతరం శిక్షణకు హాజరైన రైతులకు సర్టిఫికెట్లు పంపిణీ చేయడంతో పాటు గోమయంతో తయారు చేసిన గణేష్ ప్రతిమలను శిక్షణకు హాజరైన అందరికీ ఉచితంగా అందించారు.